కథ

**జంధ్యాల మాలతి**

# పసి(డి) మనసు

వాకింగ్‌కి బయలుదేరే ముందే మేఘాలు దట్టంగా కమ్ముకుని ఉన్నాయి. రెండు కిలోమీటర్లు నడిచానో లేదో గాలి ఆరంభమయింది. పెద్ద పెద్ద చెట్లు కూడా గాలికి ఊగిపోతున్నాయి. సన్నని తుంపర, గాలి హోరు. తిరిగి ఇల్లు చేరదాం ఇవాల్టికి చాలని అనుకుని వెదుదిరగబోయాను.

నా ముందు రోడ్డు చివరగా నడుస్తూ ఒక పాప ఏడుస్తూ కనిపించింది. ఆ పాప వేపు నడిచాను. సంధ్యా సమయం. పైగా గాలీ వానా రావటంతో రోడ్డు క్షణాల మీద నిర్మానుష్యమయిపోయింది. సైకిళ్లు, బైకుల మీద వెళ్లే వారు కూడా చాలా స్పీడుగా ఇల్లు చేరదామని ప్రయత్నిస్తున్నారు. అటువంటప్పుడు ఆ పాప గురించి ఎవరు పట్టించుకుంటారు?

"ఏం పాపా ఏడుస్తున్నావు? దోవ తప్పిపోయావా?" అని పాప చెయ్యి పట్టుకుని అనునయంగా అడిగాను.

నా సానుభూతికి, ప్రేమకి ఆ పాప ఇంకా వెక్కి వెక్కి ఏడుస్తోంది. పాపని ఎత్తుకుని కన్నీళ్లు తుడిచి, జుట్టు సర్ది "నీ పేరేమిటి పాపా? మీ ఇల్లెక్కడ, ఎందుకేడుస్తున్నావ"ని మళ్లీ అడిగాను.

ఈసారి పాప వెక్కిళ్లు ఆపుకుని "మామ్మ, మామ్మ దెబ్బతగిలి పడిపోయింది, రోడ్డు మీద పడిపోయింది" అంది.

"అరెరె ఎక్కడ ఎక్కడ పాపా? ఎక్కడ పడిపోయింది మీ మామ్మ?"

"ఈ రోడ్డు మీదే ఇంకా ముందుకు వెళ్తే అక్కడ. రోడ్డు మీద నడుస్తుంటే ఒకతను మోటార్‌బైక్ వేగంగా నడుపుతూ మామ్మను తొక్కించేశాడు. మామ్మ ముఖానికి దెబ్బ తగిలి రక్తం" అంటూ మళ్లీ ఏడుస్తోంది.

పాప చూపించిన దిశగా ముందుకు వెళ్తే రోడ్డు మధ్య పడిపోయి ఉన్న ముసలామె కనిపించింది. ఆమెను చూడగానే పాప నా చెయ్యి వదిలించుకు మామ్మ దగ్గరకు వెళ్లి ఆమెను లేపుతూ "మామ్మా, లే మామ్మా" అంటూ ఏడుస్తోంది.

నేను వెంటనే హాస్పిటల్‌కి ఫోన్ చేసి అంబులెన్స్ తెప్పించి మామ్మకు ట్రీట్‌మెంట్ సంగతి చూశాను. మరీ బలమైన గాయం కాదు కానీ వృద్ధాప్యంలో వచ్చే వీక్‌నెస్ వల్ల ఆమె పడిపోయిందని గ్రహించాను. ఆవిడ గాయానికి బేండేజ్ వెయ్యటం, ఇంజక్షన్ ఇవ్వటం అంతా జరిగేటప్పటికి ఒక గంట పట్టింది. గాయానికి కలిగిన నొప్పి తెలీకుండా వేడి కాఫీ, రొట్టెతో పాటు సెడెటిన్ కూడా ఇచ్చాను. ఇంతసేపూ పాప బుద్ధిగా బల్ల మీద కూచుంది. నేను బిస్కెట్ ప్యాకెట్ తెప్పించి పాప చేతిలో పెట్టాను. అయినా ఒక్కటి కూడా తినలేదు.

"పాపా, నువ్వు ముందు బిస్కెట్లు తిను. మీ మామ్మకి ఏమీ ఫరవాలేదు. పొద్దున్నయ్యేసరికి బాగవుతుంది. అప్పుడు మీ మామ్మా, నువ్వూ కలిసి ఇంటికి వెళ్లచ్చు" అన్నాను.

బిస్కెట్ ప్యాకెట్ రెండు చేతుల్తో తిప్పుతూ పాప నా కళ్లల్లోకి లోతుగా చూసింది.

"నిజం. మీ మామ్మకేం ఫర్వాలేదు. సడన్‌గా దెబ్బ తగలడంతో షాక్‌లా అయింది!"

"ఈ మామ్మ మా మామ్మ కాదు?"

షాకయ్యాను. "మరి ఎవరీవిడ?"

"నాకు తెలియదు. రోడ్ మీద నేనేడుస్తూ నడుస్తుంటే ఈ మామ్మని బైక్ మీద వెళ్తున్నతను గుద్దించేసేడు. పాపం పడిపోయిందని మీకు చెప్పేను"

"మరయితే నువ్వెందుకేడుస్తున్నావు, అసలు నువ్వొకర్తివీ అంత సాయంకాలం ఎక్కడికి బయలుదేరావ్?" పాప చెయ్యి పట్టుకుని నిమురుతూ అడిగాను.

పాప మళ్లీ వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది.

పాపని దగ్గరికి తీసుకుని "ఫరవాలేదు పాపా, నేనేం అనను. మీ మమ్మీ, డాడీ ఎవరూ లేకుండా నువ్వెందుకు ఒక్కర్తివీ రోడ్డు మీద నడుస్తున్నావ్?"

పాప వేసుకున్న డీసెంట్ యూనిఫామ్, కట్టుకున్న టై, వేసుకున్న షూస్, పాప పేరెంట్స్ స్టాండర్డ్ ఆఫ్ లివింగ్‌ని చెప్పకనే చెబుతున్నాయి.

నేను ఇంకొంచెం బుజ్జగించాక పాప చెప్పింది.

"అంకుల్, నువ్వు మా డాడీ మమ్మీలతో చెప్పనంటే చెబుతాను"

"చెప్పనులే. అసలేం జరిగిందో చెప్పు!"

"మరేమో నాకు మా మామ్మ అంటే చాలా ఇష్టం. మామ్మతోనే ఉండాలనిపిస్తుంది. స్కూల్నుంచి ఇంటికి రాగానే మామ్మ లేకపోతే ఏం తోచదు. అందుకే..."

"మరి మీ మామ్మతోనే ఉండచ్చుగా"

"నేనంత లక్కీగాళ్‌ని కాదంకుల్. మా మామ్మ మా ఇంట్లో ఉండటం మమ్మీకి, డాడీకి ఇష్టం లేదు. అందుకనే మామ్మని...మామ్మని..."

"ఊ. మామ్మని ఏం చేసేరు?"

"మా మామ్మని ఓల్డ్ ఏజ్ హోమ్‌కి పంపించేరు. మా మామ్మ కూడా నేను లేకపోతే ఉండలేదు. నవీ...నవీ.. అంటూ నేను స్కూల్నుంచి రాగానే నాకు చేగోడీలు, మైసూర్‌పాక్ చేసి పెట్టేది. ఇప్పుడేమో మామ్మ లేదు. ఇంటికి వచ్చేసరికి ఎవరూ లేరు"

"మరి మీ మమ్మీ?"

"మమ్మీ, డాడీ ఇద్దరూ ఇంకా ఆఫీసు నుంచి రాలేదు. నైబర్స్‌కి కీ ఇచ్చేరు. బుక్స్ ఇంట్లో పడేసి మామ్మ కోసం వెదుక్కుంటూ బయలుదేరాను"

"మామ్మ దగ్గరికి వెళ్తానని డాడీని ఒప్పించాలి గానీ నువ్వొక్కర్తివే ఇట్లా రోడ్ మీద పరిగెట్టొచ్చా. ఈ మామ్మకి తగిలిన దెబ్బ నీకు తగిలితే?"

"అంకుల్ మీరు నన్నా ఓల్డ్ ఏజ్ హోమ్ దగ్గరికి తీసుకెళ్లరా, మామ్మ దగ్గరికి"


"అలాగే. ఈ రాత్రి మా ఇంట్లో భోజనం చేసి పడుకో. రేపు మార్నింగ్ తీసుకువెళతాను."

ఆ ఓల్డ్ ఏజ్ హోమ్ పేరేమిటి? సిటీలో ఎక్కడని గాలించడం?

ముందు పాప పేరెంట్స్‌ని కలిసి పాపను వాళ్లకు అప్పజెప్పి మామ్మ లేకుండా పాపకి కష్టం. ఆమెని ఇంటికి తీసుకువెళ్లండని వాళ్లని కన్విన్స్ చేయాలి. అసలు ఈపాటికి పాప మమ్మీ డాడీ పాప కోసం ఎంత వెదుకుతున్నారో?

ఈ ఆలోచన రాగానే "పాపా, మీ మామ్మ మళ్లీ మీ ఇంటికి రావాలంటే మీ మమ్మీ డాడీలను నేను కలసి ఒప్పించాలిగా. మీ ఇంటి అడ్రసు చెప్పగలవా?" అనడిగాను.

పాప వాళ్ల అడ్రసు చెప్పింది. అది కాగితమ్మీద నోట్ చేసుకున్నాను. "డాక్టరంకుల్, మీరు మా పేరెంట్స్‌ని ఒప్పించగలరా, ప్లీజ్ ఎలాగేనా ఒప్పించండి. మా మామ్మ ఇంటికి రావాలి. నాకు కథలు చెప్పి ఇష్టమైన స్వీట్స్, స్నాక్స్ చేసి ఇవ్వాలి. ప్లీజ్ నేను మా మామ్మని



చూస్తాను కదూ. చెప్పండి అంకుల్."

"ష్యూర్. ష్యూర్ తప్పకుండా. మీ మామ్మని మీ ఇంటికి తీసుకువచ్చేట్టు చూస్తాను"

"ప్రామిస్?"

"ప్రామిస్" పాప తలపై చేయి వేశాను. నా స్నేహపూర్వక స్పర్శతో అట్లానే నిద్రపోయింది. నేనూ నిద్రకి ఉపక్రమించబోయాను.

ఛెళ్లు ఛెళ్లుమని నన్ను ఎవరో కొడుతున్నారు. పక్క మీద నుంచి లేచి కూచున్నాను.

'సిగ్గులేదంరా నీకు? నువ్వు చేసిన ఘనకార్యం మరిచిపోయి ఇక్కడ పాపను వాళ్ల మామ్మతో కలపడానికి తగుదునమ్మా అని బయలుదేరావ్'

చెంపలకి బదులు గుండె తడుముకున్నాను.

నిజమే. పాపా తమ్మణ్ని. నా బుజ్జిబాబుని, వాళ్ల అమ్మని కూడా వాళ్ల ఖర్మానికి వాళ్లని వదిలేసి వేరే ఊళ్లో ఉంటున్నాను.

రేవతి నా భార్య. చాలా మంచిదీ. అణకువ గలదీ. మాకొక రెండేళ్ల బాబు. మేం ముగ్గురం ఎంతో ఆనందంగా ఉండేవాళ్లం.

అయితే రెండు సంవత్సరాల క్రితమే రేవతి వాళ్ల అమ్మ అంటే మా అత్తగారు మా మామగారు పోవడంతో మా పంచన చేరింది. ఆవిడ వచ్చిన దగ్గర్నుంచి మా బాబుకు పండుగే పండుగ. రేవతిని ఆమె ఏమీ పని చేయనిచ్చేది కాదు. బాబుని ఎత్తుకు దించేది కాదు. చాలా ఆనందంగా ఉండేది ఇల్లు.

కానీ క్రమంగా నాకే ఎందుకో మా అత్తగారు మాతో ఉండటం నచ్చలేదు. ప్రతీరోజూ వంట బాగోలేదనో, బాబుని ఎప్పుడూ ఎత్తుకు పాడుచేస్తున్నారనో, ఇల్లు దర్టీగా చేస్తున్నారనో ఆమెను మాటల్తో హింసించడం ప్రారంభించేను. ఈ కరువు రోజుల్లో మరొక శాల్తీ ఇంటికి బరువే కదా. ఈ విషయం రేవతికి చెప్పి వాళ్లమ్మని పంపెయ్యమన్నాను.

రేవతి ఉలిక్కిపడి "ఈ వయసులో మా అమ్మ ఎక్కడికి పోతుంది. నేను తప్ప ఆమెకి ఎవరూ లేరు కూడా. మా నాన్న చనిపోయినప్పుడు వచ్చిన మొత్తం పైకం మన బాబు పేరున రాసేసింది కూడా. ఇప్పుడు ఎక్కడికి పోతుంది, ఎలా బతుకుతుంది" అంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది.


"నాకదంతా తెలియదు. నేను డాక్టర్ని. నీకు పనుల్లో సాయంగా పనివాళ్లని, బాబుని చూడ్డానికి ఆయాని పెట్టగలను. కానీ మన మధ్య ఆవిడ ఉనికి నాకు నచ్చడం లేదు. పంపేసెయ్యి. ఒక పదివేలు ఆవిడ ముఖాన కొడితే సరి. ఎక్కడికేనా వెళ్లి ఉంటుంది"

"బాగా చెప్పేరండి. పదివేలు ఇమ్మన్నారా, పదివేలు. బాబు పేర్న ఆవిడ రాసిన సొమ్ము ఆరు లక్షలకి పైగా ఉంది. ఆవిడకి పదివేలిచ్చి పంపెయ్యమంటున్నారా. అయినా అమ్మ ఉండటం వల్ల టైముకి మీకన్నీ అమరుతున్నాయి కానీ కష్టం ఏం లేదే. ఎందుకు ఆవిడంటే మీకింత కక్ష?"

నేను కొంచెం సర్దుకుకూచుంటూ "నేను నీ లాజిక్ పాయింట్లకి ఆన్సర్ చెయ్యలేను. డాక్టర్ని కానీ, లాయర్ని

కాదు. పది కాకపోతే ఇరవై వేలియ్యి. అయినా నిన్ను పెళ్లి చేసుకున్నప్పుడు కట్నం పుచ్చుకోలేదే. ఇప్పుడు ఆవిడంతట ఆవిడే ఇస్తే పుచ్చుకోవటం తప్పా? అయినా నా తల్లీతండ్రీ నా దగ్గర ఉండొచ్చు కాని, అత్తగారు ఉండటం ఏమిటి ఖర్మ!"

"బాగా చెప్పారండి. మీ తల్లీ తండ్రీ ఏనాడో పోయేరు. వారు బతికుంటే వారినీ పొమ్మనేవారేమో. మీకు వృద్ధుల పొడ గిట్టదు లాగుంది. నాకు, బాబుకి మాత్రం మా అమ్మ కావాలి. మీరేమనుకున్నా సరే!"




"నువ్వెంత మొండిగా చెప్తే, నేనూ మొండినే. మీ అమ్మని తక్షణం ఇక్కణ్నుంచి పంపేస్తావో లేక మనం విడిపోతామో ఆలోచించు" చరచరా బయటకి నడిచాను.

ఆ రోజు సాయంకాలం వరకు ఇల్లు చేరలేదు. హాస్పిటల్‌లోనే గడిపాను. చీకటి పడుతోండగా ఇంటికి వచ్చాను. తలుపులు చేరవేసి ఉన్నాయి. తెరవగానే చీకటి స్వాగతం పలికింది. తడుముకుంటూ లైట్ వేశాను. టీపాయ్ మీద మడత పెట్టిన కాగితం కనిపించింది.

"మేం ముగ్గురం వెళ్లిపోతున్నాం. మా అమ్మ మీకిష్టం లేనప్పుడు మీరూ మాకిష్టం లేదు. -రేవతి" అని కాగితం ఉంది.

రేవతి ఇట్లా చేయగలదని ఊహించలేదు. వాళ్ల అమ్మ ప్రోద్బలం అయి ఉంటుంది. పళ్లు నూరాను. రేవతి ఎట్లా బతుక్కొస్తుంది? డిగ్రీ మధ్యలో తన చదువు ఆగిపోయింది. అయితే కంప్యూటర్‌పై వర్క్ వచ్చు. అందుకే కాబోలు నన్ను కాదని వెళ్లిపోయింది.

'పోనీ బతకలేకపోతే కాళ్లబేరానికి రాదా ఏం?' నా బింకం.

తర్వాత నా మకాం అక్కణ్నుంచి ఎత్తివేసి ఈ ఊళ్లో ఉంటూ అప్పుడే ఏణ్నర్థం అయింది. ఇక్కడ లైఫ్ గడిపేస్తున్నాను. టెన్షను మరిచిపోవడానికి హాస్పిటల్‌లో వర్క్ ఎక్కువ చేశాను. ప్రతీరోజూ రెండు మూడు గంటలు వాకింగ్‌లో గడుపుతున్నాను. అయినా మొదట్లో ఉన్న 'జీలో' పోయింది. గుండె తరచూ బరువెక్కిపోతోంది. నేను వదిలేసిన ఊరికి మా ఫ్యామిలీ ఎలా ఉందో చూసి రమ్మని మనుషుల్ని పంపాను కానీ వాళ్లు ఎలా ఉన్నదీ, ఎక్కడ ఉన్నదీ తెలియరాలేదు. బాబుని స్కూల్లో వేసి ఉంటారు. రేవతికి ఎక్కువ జీతం తెచ్చుకునే అవకాశం లేదు. ఎట్లా బతుకుతున్నారో ఏమో అనే చింత. పిచ్చి కాని పనిమనిషిని, ఆయాని పెడితే డబ్బు అవదా. ఊరికే వృద్ధాప్యంలో మా అత్తగారిని ఏవగించుకున్నాను కాని.

మనసు గతాన్ని వీడి వర్తమానంలోకి వచ్చింది. పాప ప్రశాంతంగా నిద్రపోతోంది. నేను గట్టి ప్రయత్నం చేసి ఉంటే రేవతి గురించి తప్పక తెలుస్తుంది. మరి నేను ఎందుకు తాత్సారం చేస్తూ మా బాబు భవిష్యత్తు కూడా నాశనం చేస్తున్నాను? అహంకారం.. అవును. అహంకారమే. నాలోని అహంకారమే మా అత్తగారిని శత్రువులా చేసింది. గుండెల్లో మమత పెరిగితే పూలై పూచి ఆనందం కలిగిస్తుంది. అహంకారం పెరిగితే జీవిత సౌధానికి బీటలు వేసి భవనం సమూలంగా కూలిపోతుంది.

పాప నా కళ్లు తెరిపించింది. పసి మనసు నిజంగా పసిడి మనసే. తన మామ్మనే కాక ఇంకొక వృద్ధురాలిని కూడా నిండు మనసుతో ప్రేమించి ఆమెకి సమయానికి వైద్య సదుపాయం కలిగించింది. నేను ఉదయం లేవగానే ముందు పాపని వారింటికి చేర్చి ఓల్డ్ ఏజ్ హోమ్ నుంచి పాప మామ్మని ఇంటికి చేర్చే ఏర్పాటు చేయాలి. ఆ తర్వాత రేవతి ఉనికి గూర్చి గట్టి ప్రయత్నం చేసి నలుగురం ఒక గూటికి చేరాలి.

వృద్ధులకీ, పసివారికీ మధ్య మమతానుబంధం గట్టిది. దానిని తెంచితే కుటుంబ వ్యవస్థ పేలవంగా మారుతుంది. మమతే మానవ మనుగడకి మూలసూత్రం కదా!

## షీలాకి మంచి ఛాన్స్!

గతంలో కొన్ని చిత్రాల్లో నటించినా 'పరుగు' చిత్రంతోనే వెలుగులోకి వచ్చింది షీలా. ఈ సినిమా విజయం సాధించినా కూడా చెప్పుకోదగిన చాన్సులు ఆమె ఇంటి తలుపు తట్టలేదు ఎందుకో మరి! అయితే తాజాగా షీలాకి మంచి చాన్స్ వచ్చింది. ఎమ్మెస్ రాజు తాజా చిత్రం 'మస్కా'లో రామ్ సరసన నటించే రెండో కథానాయికగా ఎన్నికైంది షీలా. ఇందులో ఆల్రెడీ హన్సిక హీరోయిన్‌గా నటిస్తోంది. సక్సెస్ ఫుల్ నిర్మాత 'దిల్' రాజు సినిమా 'పరుగు'తో వెలుగులోకి వచ్చిన షీలా మరో హిట్ చిత్రాల నిర్మాత 'ఎమ్మెస్ రాజు' సినిమాలో అవకాశం సంపాదించుకుందన్నమాట.

